చేస్తున్న పని ద్వారానే మనం తరించవచ్చు. మనం చేస్తున్నపని స్వార్థం లేకుండా చేస్తే మనం చేసే పనిద్వారానే మనం తరించవచ్చు. ఏరకంగా పని చేస్తే పని నిన్ను బంధించదో ఆ రకంగా పనిచెయ్యి. బుద్ధుడిని దేవుడు ఉన్నాడా లేడా అని అడిగితే మౌనం వహించేవాడు. ఆయన ఎక్కువగా మౌనంగా ఉండేవాడు. ఆ మౌనాన్ని మనం తప్పగా అర్థం చేసుకోకూడదు. ఆ మౌనం ద్వారా శక్తిని ఇచ్చి మధ్యవర్తులతో సంబంధం లేకుండా ఎక్కడైతే ఆనందం ఉందో, ఎక్కడైతే నిర్వాణస్థితి ఉందో సూటిగా అక్కడకు అంటే హృదయగుహలోనికి పంపటమే ఆ మౌనం యొక్క లక్ష్యం. ఆ మౌనాన్ని మనం అపార్థం చేసుకోకూడదు.

మనం గృహస్థాశ్రమంలో ఉన్నా, సన్యాసాశ్రమంలో ఉన్నా, బ్రహ్మచర్యంలో ఉన్నా మనస్సులో అల్పత్వం ఉంటే వాడికి జ్ఞానం రాదు. మా అత్తగారు నన్ను ఎక్కువగా తిడుతున్నారు అని ఒక కోడలు భగవాన్‌తో చెపుతున్నారు. భగవాన్ ఏమి చెప్పారు అంటే నువ్వు నా దగ్గరకు ఎందుకు వస్తున్నావు అని అడిగారు. మిధ్యా నేనును పోగొట్టుకోవటానికి వస్తున్నాను అని చెప్పింది. మీ అత్తగారు ఎవరిని తిడుతున్నారు ఆ మిధ్యానేనునే తిడుతున్నారు. నువ్వు ఏదైతే పోగొట్టుకోవాలి అని ప్రయత్నంచేస్తున్నావో ఆ దొంగనేనునే, మిధ్యానేనునే మీ అత్తగారు తిడుతున్నారు అంటే మీ అత్తగారునీకు అపకారం చేయటంలేదు, ఉపకారమే చేస్తున్నారు అని భగవాన్ చెప్పారు. నువ్వు దేనిని పోగొట్టు కోవటానికి ప్రయత్నంచేస్తున్నావో అదిపోవటానికి పరోక్షంగా మీ అత్తగారు సహాయం చేస్తున్నారు అని చెప్పారు. వర్షం రూపంలో వచ్చేవాడు ఈశ్వరుడు, వర్షాన్ని ఆపేవాడు ఈశ్వరుడు. అందుచేత ఈశ్వర సంకల్పాన్ని వ్యతిరేఖించకూడదు. ఈశ్వర సంకల్పానికి అనుకూలంగా మన మనస్సు స్పందించదు అనుకోండి మనకు దుఃఖం వస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, కేశనకుర్రుపాలెం, 23-3-2000

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మానవుడు తన హృదయంలో ఉన్న సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకొనేవరకు సంతృప్తి అవ్వడు. మనకు లేనిది ఏదోవచ్చాక మనం సుఖపడవచ్చు అనిపిస్తుంది. కాని అదివచ్చాక అందులో ఏమీ లేదని తెలుస్తుంది. మన హృదయంలో ఉన్న నిజం మనకుఅనుభవం అయ్యేవరకూ జనన మరణ ప్రవాహములో కొట్టుకొని పోవలసిందే. ఎవరు ఏ మార్గములో ప్రయాణం చేసిన ప్రకృతి లక్షణాలను దాటి వెళ్ళాలి. మరణించే

ఈ శరీరముతో నీకు ఎంత బలంగా, ఎంత గాఢంగా తాదాప్యం ఉందో అంత బలంగా నీ హృదయంలో ఉన్న సత్యవస్తువుతో సంపూర్ణంగా తాదాప్యం రావాలి అప్పడు అజ్ఞానం నశిస్తుంది. దేహం కూడా నీడ ఎలా వస్తుందో అలాగ మన వెనకాలు ఇష్టాలు అయిష్టాలు వస్తాయి. వాటి వలన హృదయంలో ఉన్న మనస్సు బాహ్యాముఖానికి వస్తుంది. అందువలన మన ఇష్టాలు, అయిష్టాలు తగ్గించుకోవాలి, మన ధర్మం ఏదో మనం ఆచరించాలి. ఈ శారీరమే నేను అనుకొనే మనస్సుకు ఇది నీవు కాదు, లోపల ఉన్న సద్వస్తువే నీవు అని చెప్పిదానిని లోపలకు తీసుకొని వెళ్ళాలి, దానికి అంతర్‌దృష్టి కలుగజేయాలి. పరిణామంలో మనం ఆజన్మకు ఆ జన్మ వివేకవంతంగా, మెలుకువగా జీవించాలి. అజాగ్రత్త పనికి రాదు, అశ్రద్ధ పనికి రాదు. అశ్రద్ధ ఉన్నవాడికి జ్ఞానం రాదు.

పూజ చేయాలన్నా, యజ్ఞం చేయాలన్నా మనం ఎంతో కొంతపని చేయాలి. అలాగే మన హృదయంలో ఉన్న సత్యాన్ని అనుభంలోనికి తెచ్చుకోవాలంటే మనం ఏరకంగా పనిచేస్తే అది అనుభవంలోనికి వస్తుందో తెలుసుకొని ఆ రకంగా పనిచేయటం నేర్చుకోవాలి. మనం చేస్తున్న పని మనలను బంధించకూడదు. ఇతరులలో ఉన్న దోషాలు చూస్తూ ఉంటే ఈ లోపల మీ రోజులు వెళ్ళిపోతాయి. మీ దోషాలు మీకు తెలియవు. ఎవరి మీద మోహం పెట్టుకోకూడదు, ద్వేషం పెట్టుకోకూడదు. అంతర్యామిగా ఉన్న పరమేశ్వరుని చూడటం అలవాటు చేసుకోవాలిగాని కొంతమందిని ద్వేషించటం కొంతమందిని అతిగా ప్రేమించటం అలాగైనా ఇలాగైనా నీ మనస్సు బాహ్యాముఖానికి వచ్చేస్తుంది. రెండూ చెడ్డవే. భగవంతుని రూపాన్ని నామాన్ని ధ్యానించగా ధ్యానించగా మనకు బోధించటానికి భగవంతుడే గురురూపంలో వస్తాడు. భగవంతుడు గురురూపం ధరించాలి అంటే మనం చేసే పని ద్వారా భగవంతుని దయను సంపాదించాలి. బేధం భగవంతుడికి లేదు, జీవుడికి బేధం ఉంది, బేధబుద్ధి తగ్గించుకోవాలంటే ఇష్టాయిష్టాలు తగ్గించుకోవాలి. ఈశ్వరుడి మీద సజీవమైన విశ్వాసం కలుగకపోతే ప్రతీ చిన్న విషయానికి భయం వచ్చేస్తుంది. మనోధైర్యం అలవాటు చేసుకోవాలి. అన్ని మానసిక రుగ్మతలకు భయమే కారణం. భయం తగ్గించుకొంటే పరిణామంలో మంచి భవిష్యత్ ఉంటుంది. చాలా మందికి మంచిపనులు చేయాలని ఉంటుంది గాని భయం వలన చేయలేరు. భయం తగ్గించుకొంటే మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తుంది. ఉన్నది ఒక్కటే వస్తువు. రెండు ఉన్నప్పడు భయం వస్తుంది. ఉన్నది ఒక్కటే అయినప్పడు భయపడేది ఏముంది, భయపడవద్దు. అందరిచేత మంచి అనిపించుకోవాలంటే అది కూడా పిచ్చితనంలో ఒకటి అంటే వాడికి లోకవాసన ఎక్కువగా ఉంది అని అర్ధం. అలా అనుకొనే మనిషి మాయ యొక్క వలలో ఉంటాడు.

శీతాకాలంలో మనం చలి ఫీల్ అవుతాము. ఎండాకాలంలో వేడి ఫీలవుతాము. అలాగే నీ హృదయంలో ఉన్న ఆనందాన్ని, సత్యాన్ని ఫీలవ్వటం ప్రారంభిస్తే దాని వైభవం నీకు తెలుస్తుంది. ఇతరుల మాటలు మీరు నమ్మనక్కరలేదు. భగవంతుడు గురురూపం ధరించి వచ్చి చూపుద్వారా మాట ద్వారా మీ మనస్సును నిర్మలం చేస్తాడు, నిశ్చలం చేస్తాడు. మీ తల్లిదండ్రులు మీకు తిండి సంపద ఇవ్వగలరు గాని మీ మనస్సును నిర్మలం చేయలేరు. గురువు నీ మనస్సును నిర్మలం చేసి నిశ్చలం చేసి నిన్ను గమ్యం దగ్గరకు తీసుకొని వెళతాడు. అవమానాలు భరించాలి. అవమానాలు భరించలేకపోతే దేహాభిమానం పెరిగిపోతుంది. పూర్వం నేను వండిన కూర బాగాలేదు అని మా ఆయన అన్నారు అప్పటినుండి ఆయనను చూస్తూ ఉంటే ఎక్కువ కోపం వచ్చేస్తోంది అని ఒక అమ్మగారు చెపుతున్నారు. ఆయన అన్నది చిన్నమాట, కాని దేహాభిమానం వలన అలా అనిపిస్తోంది. ఇటువంటి మాటలు పట్టించుకొంటే మనకు జ్ఞానం కలుగదు. ఇటువంటి మాటలు ఎలా తీసుకోవాలి అంటే మనం కూర బాగా వండలేకపోతున్నాము. ఇంకా బాగా వండాలి అని లోపాలు గ్రహించి మనం సరిచేసుకోవాలి గాని ఇలా కోపాలు తెచ్చుకోవటం వలన ఈశ్వరానుగ్రహానికి దూరమవుతాము. మనకు ఎంతసేపు బహుమానాలు పుచ్చుకోవటం చేతనవును గాని అవమానాలు భరించలేము. ఎవరైనా బంధువులు ఇంటికి వెళితే వారు మాట్లాడలేదు అనుకోండి అది కూడా భరించాలి. అవమానాలు భరించలేకపోతే దేహాభిమానం పెరిగిపోతుంది. అజ్ఞానం పెరిగిపోతుంది.

నా గురువును ఎలా కనుక్కోవాలి అని ప్రశ్న. నిరంతరం ధ్యానం చేయటం వలన నీ గురువు ఎవరో నీకు తెలుస్తుంది. ఎవరు జ్ఞాపకం రావటం వలన నీ హృదయంలో ఉన్న సౌందర్యం నీకు తెలుస్తోందో, ఎవరిని తలచుకోవటం వలన నీ మనస్సు నిర్మలం అవుతోందో వాడే నీ గురువు. మనం దేహం అనే అడవిలో ఉన్నాము. ఈ అడవిలో నుండి బయటకు రావటానికి నీకు మార్గం చూపేవాడే గురువు. గురువే ఉపాయం, గురువే గమ్యం. మా హృదయంలో సత్యవస్తువు ఉంది అని మీరు చెపుతున్నారు. దానిని తెలుసుకోవటానికి మీరు సహాయం చేయరా అని అడుగుతున్నారు. గురువు సహాయం ఎప్పుడూ ఉండనే ఉంటుంది. అది నీ కళ్ళకు కనబడదు. మీ మనస్సుకు అంతర్‌దృష్టి కలిగితే హృదయంలో ఉన్న ఈశ్వరుడి టచ్ నీకు తెలుస్తుంది. గురువు లోపల ఉన్నాడు అంటున్నారు. లోపల గురువు కాదు, నాకు కళ్ళకు కనబడే గురువు కావాలి అని అడుగుతున్నారు. నీ కళ్ళతో చూసే గురువే చెపుతున్నాడు గురువు లోపల ఉన్నాడని అంటున్నారు భగవాన్. ప్రతీ జన్మలో గురువునీకూడా వస్తాడు. నిజమైన గురువు నీ లోపలే ఉన్నాడు కదా ఆయన నీకు

అనుభవంలోనికి వచ్చేవరకు గురువు నిన్ను విడిచిపెట్టడు. రేపు ఏమిజరుగుతుందో చెపుతారు అనుకోండి, రాబోయే జన్మలో ఎక్కడ ఉంటారో చెప్పగలిగే శక్తి మీకు ఉంది అనుకోండి కాని మీకు శాంతి లేకపోతే వాటివలన ఏమీ ప్రయోజనం లేదు. శాంతి లేనివాడికి సుఖం లేదు. దేవుడు ఉన్నాడో, లేడో మనకు తెలియదు, దేహం, మనస్సు మనకు తెలుస్తోంది. ఈ దేహాన్ని, మనస్సును దేవుడు చెప్పినట్లు మలచుకో. అప్పుడు దేవుడు తెలియబడతాడు. వివేకవంతుడిగా జీవించే వాడికి ఎప్పటికప్పుడు మనస్సు బేలెన్స్ చేసుకొంటూ జీవించే వాడికి హృదయంలోఉన్న జ్ఞానగంగ అందుతుంది. గురువు అనుగ్రహం లేదు అని అనుకోవద్దు. అది ఎప్పడూ ఉంది కాని అది మీకు తెలియటం లేదు. ఆ తెలిసే రోజు వస్తుంది. గురువు యందు భక్తి కలిగినప్పుడు శరణాగతి భావన కలిగినప్పుడు, ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే అనే స్థిరమైన భావన మీకు కలిగినప్పుడుగురువు అనుగ్రహం మీకు తెలుస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, గుమ్మంపాడు, 3-5-2000

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఏపని ఎప్పడు జరగాలో అప్పడు జరుగుతూ ఉంటుంది. మనం కంగారుపడినంత మాత్రం చేత తొందరగా జరుగదు. మనం భౌతికంగా అయినా, అధ్యాత్మికంగా అయినా అభివృద్ధి పొందటానికి కొంతటైము పడుతుంది. మన చేతిలో ఉన్నది కృషి. ఆ కృషి తాలుక ఫలం ఎప్పడు రావాలన్నది ఈశ్వరుడి నిర్ణయం ప్రకారం జరుగుతుంది. అందువలన మన చేతిలోఉన్న పనిని శ్రద్ధగా చేయాలి. ఫలితం కోసం ఎదురు చూడకూడదు. ఒక సంపన్నురాలు భగవాన్ దగ్గరకు వచ్చారు. మీ సన్నిధి వలననే శాంతి కలుగజేస్తారని విన్నాను. ఇది వరకు ఒకసారి మీ దగ్గరకు వచ్చాను కాని మీ దగ్గర ఎక్కువ కాలం ఉండలేకపోయాను, దర్శనం చేసుకొని వెళ్ళిపోయాను. మా ఇరుగుపొరుగు వారు సత్యాన్వేషకులు కాదు, సత్యాన్ని తెలుసుకొందామని ధ్యాస వారికి లేదు, సాధనలో సహకరించే మనుషులు కాదు. అందరూ నేను, నేను అంటున్నారు ఈ నేనులు అన్నీ దొంగనేనులు అని మీరు చెపుతున్నారు. నిజమైననేను హృదయంలో ఉంది అని చెపుతున్నారు. అంతలోతులలోనికి వెళ్ళే వైరాగ్యం నాకు లేదు. వైరాగ్యం లేకపోతే అంతలోతులలోనికి వెళ్ళలేము కదా. ఏదో కొద్ది రోజులు ఇక్కడ ఉండాలి అని వచ్చాను. ఈ కొద్ది రోజులలో మీరు మమ్మల్ని అనుగ్రహించండి అని అడగటం న్యాయంకాదు, కాని